క్లుప్తంగా

అమ్మవారి అలంకరణపై వర్క్‌షాపు



విజేతలకు బహుమతులు అందిస్తున్న క్షత్రియ మహిళల విభాగం అధ్యక్షురాలు సంధ్య

బోట్‌క్లబ్: స్థానిక క్షత్రియపరిషత్ కమ్యూనిటీ హాల్లో గురువారం క్షత్రియ మహిళల విభాగం ఆధ్వర్యంలో శ్రావణ మాసం సందర్భంగా మహిళలకు అమ్మవారిని తయారుచేసి అలంకరించడంపై వర్క్‌షాపు నిర్వహించారు. పైడా అంబికా రిసోర్స్ పర్సన్‌గా వ్యవహించారు. మహిళా విభాగం అధ్యక్షురాలు వేగేశ్న సంధ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారన్నారు. అనంతరం అమ్మవారిని అందంగా అలంకరించిన మహిళలకు బహుమతులు అందించారు.

సకాలంలో రక్తం అందేలా చర్యలు



డాక్టర్ రామకృష్ణను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

బోట్‌క్లబ్: ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తం అందేలా చర్యలు తీసుకుంటానని రోటరీ బ్లడ్‌బ్యాంక్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. రోటరీ బ్లడ్‌బ్యాంక్ చైర్మన్‌గా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. మరిన్ని ఎక్కువ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి బ్లడ్‌బ్యాంకు నిల్వలు పెంచుతానన్నారు. బ్లడ్ బ్యాంకులో భద్రత నిబంధనలు పెంచాలన్నదే తన సంకల్పమన్నారు. కార్యక్రమంలో చార్మినార్ వర్మ, ప్రసాద్, ఉదయభాను, గోవిందరాజు, పెద్దరాజు, చిరంజీవిరెడ్డి, వీర్రాజు, రవిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



విద్యార్థినులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ కాకినాడ స్మార్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్‌క్లబ్ కాకినాడ స్మార్ట్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎస్‌వీఎస్ అఖిల (974/1000), ఎస్‌పీఎస్ ఐశ్వర్య (924/1000), ఎం.శ్రావ్య (914/1000)లకు చిరు సత్కారం ఏర్పాటు చేసి, బహుమతులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గరికిపర్తి ఓం నమశ్శివాయ, లయన్ వడ్డాది నాగిని మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు విద్య దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ప్రసాద్ నాయుడు, నాగేశ్వరి, అడబాల రత్నప్రసాద్, సత్యనారాయణ, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు



కూరాడలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, ఎంపీపీ, జెడ్పీటీసీలు

కరప: మండలంలోని కూరడ గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 256 మందికి వివిధ ధ్రువపత్రాలను అందజేశారు. సర్పంచ్ వాసంశెట్టి కొండ, ఉపసర్పంచ్ రావుల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్, మాజీ సర్పంచ్ రావుల ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, గుత్తుల బాలాజీ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికుల నిరసన

కాకినాడ: మున్సిపల్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నగర పాలకసంస్థ కార్యాలయం వద్ద నిరాహారదీక్ష చేపట్టారు. సీఐటీయు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ శిబిరాన్ని ప్రారంభించారు. సీఐటీయు నగరాధ్యక్షుడు పలివెల వీరబాబు, కార్మికులు దీక్షల్లో పాల్గొన్నారు.

25న శాంతిర్యాలీ

కరప: కాకినాడ భానుగుడి జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ఈనెల 25వ తేదీన ఉదయం 9.30 గంటలనుంచి నిర్వహించే శాంతిర్యాలీలో మండల పాస్టర్లు పాల్గొని విజయవంతం చేయాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ పి.డేవిడ్ రాజు కోరారు. కరపలో శుక్రవారం జరిగిన మండల పాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్ ఘటనపై కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకుని శాంతి భద్రతలు నెలకొల్పాలన్నారు.

బూత్‌ల వారీగా ఏజెంట్లను నియమించండి

- కమిషనర్ మహేష్‌కుమార్
- రాజకీయ పార్టీలతో సమీక్ష

కాకినాడ: ఇంటింటి సర్వే నేపథ్యంలో ఎన్నికల నియమావళిని అనుసరించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నీ బూత్‌లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని ఈఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఈ అంశంపై సంబంధిత అధికారులతో సమావేశమై మాట్లాడారు. సిటీ నియోజకవర్గంలో 233 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ప్రతి బూత్ పరిధిలో రాజకీయ పార్టీలు ఒకొక్క బీఎల్‌ఓను నియమించాలని సూచించారు. ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షుడు, కార్యదర్శి సూచన మేరకు ఏజెంట్లను నియమించేందుకు జాబితాను సిద్ధం చేసి తమకు అందజేయాలని కోరారు. రాష్ట్రస్థాయిలో వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అమ్ ఆద్మీ, బీఎస్పీ, బీజేపీ, సీపీఐఎం, కాంగ్రెస్, నేషనల్ పీపుల్స్ పార్టీలు జాబితాలను అందజేయాలని సూచించారు.

కారుణ్య నియామకాలు

పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తూ మృతి చెందిన ముగ్గురు కార్మికుల కుటుంబాలకు కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ శుక్రవారం కారుణ్య నియామకాలు అందజేశారు. వీరి అర్హతలను పరిగణనలోకి తీసుకుని కుండల రవీంద్ర, ఎల్లంపల్లి చిన్న నరసింహులు, ముత్యాల శ్రీదేవిలకు ఉత్తర్వులు ఇచ్చారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కారుణ్య నియామక పత్రాలను అందజేస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

అద్దెలపై సమీక్ష

నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్సులు, దుకాణాల లీజు బకాయిలపై కమిషనర్ శుక్రవారం సమీక్షించారు. నెలాఖరులోపు బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏడీసీ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఆర్వోలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

కెనాల్ అభివృద్ధిపై సమీక్ష

నీటి కాలుష్యాన్ని అరికట్టి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించే అంశంపై కమిషనర్ మహేష్ కుమార్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కొన్ని పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థజలాలు నేరుగా కాలువల్లోకి వెళ్ళే 18 ప్రాంతాలను గుర్తించామని కమిషనర్ చెప్పారు. ఆయా కంపెనీలతో సమావేశమై ఈ పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

సమగ్రంగా ఓటర్ల సర్వే

కరప: గ్రామాల్లో చేపట్టిన ఓటర్ల జాబితాపై ఇంటింట సర్వే సమగ్రంగా చేయాలని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు బీఎల్‌ఓలకు సూచించారు. కరప, వేములవాడ గ్రామాల్లో శుక్రవారం పర్యటించి, ఓటర్లకు సంబంధించి ఇంటింటి సర్వేను పరిశీలించి, ఆయన బీఎల్‌ఓలకు, వీఆర్వోలకు సూచనలు ఇచ్చారు. డీటీ కె.అనిల్‌కుమార్, రీసర్వే డీటీ కేఎస్ సురేష్, ఆర్ఐ పేపకాయల మాచర్రావు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈఈగా రాంబాబు



కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ ఏఈఈగా సుంకర రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఇన్‌చార్జిగా ఏఈఈగా పనిచేస్తున్న శ్రీనివాస్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. మండలపరిధిలో జగనన్న కాలనీలలో లబ్ధిదారులను కలసి, వారిని చైతన్యపరచి గృహనిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని ఏఈఈ తెలిపారు.

పోర్టు పీఎస్ సీఐగా సుమంత్



కాకినాడ క్రైం: కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ సీఐగా వి.లక్ష్మీ వెంకట కృష్ణ సుమంత్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్ ఎస్ఐగా డొంకరాయిలో వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఆయన ఎస్ఐ హోదాలో నర్సాపురం, పెదపూడి, కోరంగి, సామర్లకోట పోలీస్ స్టేషన్లలో పనిచేసిన ఆయన 2021 జూన్‌లో కాకినాడ మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐగా పదోన్నతిపై బాధ్యతలు చేపట్టారు.

సురక్షతో మెరుగైన సేవలు



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి



పాటి సూర్యకాంతాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- పలు డివిజన్లలో ధ్రువపత్రాల పంపిణీ

కాకినాడ: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన, పారదర్శక సేవలు అందుతాయని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 5, 20, 26 డివిజన్లలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలకు మంజూరైన ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వివిధరకాల సేవలు, సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇళ్ల ముంగిటకే పంపిణీ చేయాలనే సంకల్పంతో సీఎం జగన్ ఈ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. వలంటీర్లు, ఉద్యోగులు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి అవసరమైన సర్టిఫికెట్ల వివరాలను యాప్‌లో నమోదు చేసుకుని పిలిచి మరీ సర్టిఫికెట్లు ఇచ్చే ప్రక్రియ ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కొప్పనాతి నాగసత్యనారాయణ, సంగాడి నందం, వెలమల మల్లేశ్వరరావు, బొర్రా రమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరక్షతో ప్రజల వద్దకు పాలన

కాకినాడ సిటీ: జగనన్న సురక్షతో ప్రజల వద్దకే సంక్షేమ పాలన వస్తోందని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. శుక్రవారం తూరంగి సచివాలయం-3 వద్ద మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష ఏర్పాటు చేశారు. సీఎం జగన్ పాలన స్వర్ణ యుగాన్ని తలపిస్తోందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇటీవల వైరస్ సోకిన పందులను పూడ్చి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడిన పారిశుద్ధ్య కార్మికులను ఆయన అభినందించారు. వీరికి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అనిశెట్టి రామకృష్ణ అందించిన రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీడీవో కె.స్వప్న, ఎంపీపీ గోపిశెట్టి పద్మజ, ఇన్‌చార్జి ఈవో పి పాండురంగారావు, తురంగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గొల్లపల్లి సూర్యప్రకాశరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దాట్ల సత్యనారాయణరాజు, దుగ్గన దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

సూర్యకాంతానికి అభినందన

కాకినాడ సిటీ: తూరంగి తురంగేశ్వర ఆలయ పునర్నిర్మాణ సమయంలో ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయంగా రూ.50 వేలు సహాయాన్ని అందజేసిన నిరుపేద మహిళ పాటి సూర్యకాంతాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అభినందించారు. శుక్రవారం తూరంగిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సూర్యకాంతాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఆమెను ఆ ఈశ్వరుడు నూరేళ్లు ఆశీర్వదించి, మంచి ఆరోగ్యం ప్రసాదించాలని ఎమ్మెల్యే కన్నబాబు ఆకాంక్షించారు.

వలంటీర్లకు వందనం

సేవలతో సంతృప్తి



వెంకట్‌నగర్‌లో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వలంటీర్ కె.రాజేష్

నగరపాలక సంస్థ పరిధిలోని 4వ వార్డు లోని వెంకట్‌నగర్‌లో బి.నూకాలమ్మకు వాలంటీర్ కె.రాజేష్ చేయూత పథకం వచ్చేలా ఎంతో కృషి చేశారు. ఈమె కుమారుడికి చదువు నిమిత్తం అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలు చేయించి ఇచ్చారు. ప్రతినెల ఒకటో తేదీన ఉదయం పింఛను అందజేస్తున్నారు. ఆమె ఇంటి పట్టాకు దరఖాస్తు చేయించి ఇప్పించారు. వలంటీర్ కె.రాజేష్ అందజేస్తున్న సేవలకు కుటుంబం ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తోంది.

తెల్లవారక ముందే పింఛను ఇస్తున్నారు



మల్లిపాములవారివీధికి చెందిన ఒంటరి మహిళ జంపా భారతికు వాలంటీర్ ఎం.వీరభవానితో ఫించన్‌కు ధరఖాస్తు చేయించి పింఛను వచ్చేలా కృషి చేశారు. అంతేకాకుండా చేయూత పథకానికి దరఖాస్తు చేయించి రుణం ఇప్పించారు. డ్వాక్రా రుణమాఫీ కూడా చేయించారు. ప్రతి నెల ఒకటో తేదీన తెల్లవారక ముందే పింఛన్ అందజేస్తున్నారు. వలంటీర్ ఎం.వీరభవాని మా కుటంబానికి చేసిన సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటాం.

– జంపా భారతి, మల్లిపాముల వారి వీధి, కాకినాడ

ప్రజా అవసరాలు తీర్చేందుకే



చీడిగలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- చీడిగలో గడప గడపకూ

కాకినాడ రూరల్: ప్రజా అవసరాలు తీర్చే వేదికగా గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని చీడిగ గ్రామంలో సచివాలయం-1 పరిధిలో ఆయన శుక్రవారం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో గడప గడపకూ తిరిగారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ, ఏమైనా సమస్యలు ఉన్నదీ ఆరా తీశారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున సీఎం జగన్ గడప గడపకూ నిధులు మంజూరు చేస్తున్నారని, వాటితో ప్రజల అభ్యర్థనల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. కాకినాడ రూరల్, కరప జెడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, హితకారిణి సమాజం డైరెక్టర్ దూనబోయిన అరుణ, నాయకులు గోపిశెట్టి బాబ్జీ, గుడాల నానిబాబు, దెయ్యాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే అభివృద్ధి పనుల పూర్తి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- గడపగడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ఆగస్టు–సెప్టెంబర్ నాటికల్లా అన్ని అభివృద్ధి పనులు పూర్తిచేస్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 4వ డివిజన్ వెంకట్‌నగర్ ప్రాంతంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. సిటీ పరిధిలోని 43 డివిజన్లలో చాలావరకు అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన అభివృద్ధి పనులను కూడా ఒకటి, రెండు నెలల్లో పూర్తి చేసి, ఆ తరువాత ప్రతి డివిజన్‌లోను పర్యటించి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామన్నారు. 4వ డివిజన్ పరిధిలో మున్సిపల్ స్థలంలో సుమారు 50–60 సంవత్సరాలుగా కొంత మంది పూరిళ్ళు వేసుకుని జీవిస్తున్నారని, వీరి పట్టాల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. ఎమ్మెల్యే వెంట కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ కార్పొరేటర్లు పలకా సూర్యకుమారి, కంపర బాబి, నల్లబెల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ పరికరాల పంపిణీ

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామంలో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీలో నన్నయ వర్సిటీ వీసీ కె.పద్మరాజు దివ్యాంగులకు కృత్రిమ పరికరాలను శుక్రవారం పంపిణీ చేశారు. అపెక్స్ ఫ్రోజెన్‌ఫుడ్స్ లిమిటెడ్ సహకారంతో 50 మందికి రూ.5.1 లక్షలు విలువైన కృత్రిమ పరికరాలు, ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఉమామనో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నన్నయ ఎంఎస్‌ఎన్ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18వ సారి రక్తదానం

కరప: గ్రామానికి చెందిన దేవు మాణిక్యాలరావు 18వ సారి రక్తదానం చేసి, మానవత్వాన్ని చాటుకున్నారు. కరప శివారు రామకంచిరాజునగర్‌కాలనీకి చెందిన రోగి అనసూరి భగవాన్‌కు బ్రెయిన్ ఆపరేషన్ నిమిత్తం బి పాజిటివ్ రక్తం అవసరంకాగా బాధిత కుటుంబం మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలును సంప్రదించారు. తాతీలు స్పందించి తన మిత్రుడు మాణిక్యాలరావుకు విషయం తెలిపి రక్తదానానికి ఏర్పాటుచేశారు.


తగ్గింపు ధరలకు నిత్యావసర వస్తువులు

పిఠాపురం: జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ఆదేశాల మేరకు తగ్గింపు ధరలకే నిత్యావసర వస్తువులు విక్రయించేలా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు డీఎస్‌ఓ ఎంవీ ప్రసాద్ తెలిపారు. పిఠాపురంలో శుక్రవారం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురంలో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వాటిలో బీపీటీ బియ్యం కిలో రూ.36, కందిపప్పు కిలో రూ.46కు అందిచనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎస్‌ఓ ప్రసన్న కుమారి, ఎంఎస్‌ఓ ఎస్‌కే ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

భవిత యాప్‌లో నమోదు చేయండి

కాకినాడ సిటీ: నగరంలోని అర్బన్ భవిత కేంద్రాన్ని, పగోడా మున్సిపల్ స్కూల్, పీఆర్ గరల్స్ హైస్కూల్‌లో సీడబ్ల్యూఎస్ పిల్లల ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో సర్వశిక్షా కో ఆర్డినేటర్ అండ్ ఇన్‌చార్జి సీఈవో చామంతి నాగేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 71 మందిని ఆయా పాఠశాలల్లో చేర్పినట్టు తెలిపారు. ఈ ప్రశస్తి యాప్‌లో దివ్యాంగ పిల్లలను నమోదు చేయడం వల్ల పలు ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు.

గ్రీన్ ఎర్త్ పోస్టర్లు, ఫ్లాగ్‌ల ఆవిష్కరణ



పోస్టర్లు, పాకెట్ ఫ్లాగ్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: గ్రీన్ ఎర్త్ సంస్థ రూపొందించిన పోస్టర్లు, పాకెట్ ఫ్లాగ్స్‌ను సంస్థ ప్రతినిధులతో కలసి కలెక్టర్ కృతికా శుక్లా శనివారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ ఎర్త్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. శశికాంత్‌నగర్ లోని గ్రీన్ ఎర్త్ సంస్థ సీడ్స్‌తో పుస్తకాలు, జాతీయ జెండాలు, పెన్సిళ్లు, బ్యాగ్స్ వంటి వాటిని తయారు చేస్తోందన్నారు. వీటిని ఉపయోగించిన తర్వాత తడిపి భూమిలో నాటితే మొక్కలు వస్తాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ఓ కొత్త పంథాలో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థ సభ్యులు కె.ప్రియాంక, ఎం.ఆనంద్‌పాల్ తదితరులున్నారు. అదే విధంగా జాయ్ ఫర్ కిడ్స్ కరస్పాండెంట్ జి.సుశీల, ఎస్ఎస్ ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.సుధాకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

సానుభూతి కోసమే ప్రతిపక్షాల కంటతడి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ప్రజల సానుభూతి కోసం ప్రతిపక్షాలు కంటతడి పెట్టుకుంటున్నాయని, వాళ్లే గిల్లుతారు, వాళ్లే ఏడుస్తారన్నారని మాజీ మంత్రి కన్నబాబు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాళ్లే తిడగారు.. మళ్ళీ వాళ్ళే ఎలా అవమాన పరుస్తారంటూ మాట్లాడుతారని ఇది ప్రతిపక్షాల కొత్త ట్రెండ్ అన్నారు. సీఎం జగన్‌ను కించపరిస్తేనో, బురద జల్లితేనో మాకు మైలేజీ వస్తుందని చంద్రబాబు, పవన్ కల్యాణ్, మరెవరైనా అనుకున్నా ఒరిగేదేమీ లేదన్నారు. ఏ పథకానికి రూపాయి లంచం ఇచ్చి మంజూరు చేయించుకుంటున్నారో చెప్పాలన్నారు. సీఎం చెప్పినట్టు మేము ఒక్కరిమే వస్తామని, మీరు గుంపులుగా రండీ మేమేమీ భయపడమన్నారు. మా శక్తి, బలం ప్రజలని, మీ బలం, బలగం డబ్బు, వ్యూహం అందరూ కలిసి వచ్చి కుమ్మక్కు రాజకీయాలు చేస్తే, దానిని ఎదుర్కోవడానికి వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందన్నారు. పొత్తులతో వస్తున్నామని, ఇంతకు ముందు పొత్తులు లేవా అని పొత్తులు, మొక్కజొన్న పొత్తులు చూశామన్నారు. మీ పొత్తులు, జిత్తులకు భయపడే పార్టీ కాదు వైఎస్సార్ సీపీ అని కన్నబాబు కుండ బద్దలు కొట్టి చెప్పారు.

హమ్మాయిలే..



జిల్లా పరిషత్ రోడ్డులో ఉన్న కళాశాల గేటు దాటుతున్న విద్యార్థినులు

బాలాజీచెరువు: ప్రమాదమని తెలిసినా భారీ ఎత్తున ఉన్న గేట్లు దూకేస్తున్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గేట్లు దాటి లోపలకు, బయటకు రావడంతో చూస్తున్న వారు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయపడుతున్నారు. కళాశాలలో ప్రవేశాలకు ప్రధాన ద్వారం వద్ద ఉన్న గేట్ ఉదయం 9 గంటలు దాటితే మూసివేస్తున్నారు. దీంతో విద్యార్థులు జెడ్పీ వెనుక ఉన్న గేటు దూకి కళాశాలలోకి ప్రవేశిస్తున్నారు. విద్యార్థులు గోడపై నుంచి దూకుతున్నారని గోడకు సీసా పెంకులు వేయడంతో ఇలా గేటు ఎక్కి వెళ్తున్నారు.

మణిపూర్‌లో హింసపై కొవ్వొత్తుల ర్యాలీ

కాకినాడ సిటీ: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు ప్రధానమంత్రి మోడీ పూనుకోవాలని, హింసను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శ్రామిక మహిళా సమన్వయ కమిటీ, సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి క్రొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కాకినాడ కచేరిపేట, అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ ఆందోళన నిర్వహించారు.

గ్యాస్ లీకై మహిళకు గాయాలు

కరప: వంటచేస్తుండగా గ్యాస్‌స్టవ్ రెగ్యులేటర్ నుంచి గ్యాస్‌లీకై మంటలు చెలరేగగా, ఒకమహిళకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పీహెచ్‌సీలో సీఈఓగా పనిచేస్తున్న చోడపునీడి మంగతాయారు శుక్రవారం సాయంత్రం వంటచేస్తుండగా ఈ ఘటన జరిగింది. ఆమె ధరించిన నైటీ కాలడంతో చేతులకు, కాళ్లకు, ఇతరచోట్ల కాలిన గాయాలయ్యాయి. బంధువులు మంటలను అదుపుచేసి చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.